క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

చుంచుపల్లి/ఇల్లెందు: కొత్తగూడెం, ఇల్లెందు పట్టణ పరిసర ప్రాంతాల ఆర్టీసీ ప్రయాణికులకు సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు డయల్ యువర్ డీఎం ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కొత్తగూడెం డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సలహాలు, సూచనలు ఫిర్యాదుల కోసం 9959225959 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

మెజిస్ట్రేట్‌కు సన్మానం


రాజమల్లును సన్మానిస్తున్న దృశ్యం

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం స్పెషల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనను గురువారం ఐఎల్‌పీఏ రాష్ట్ర బాధ్యులు సన్మానించారు. టీపీసీసీ రాష్ట్ర కన్వీనర్ యాస యుగేందర్, ఐఎల్‌పీఏ రాష్ట్ర సభ్యులు మారపాక రమేష్‌కుమార్, చిన్ని కృష్ణ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నిక


ఉమామహేశ్వరరావుతో కమిటీ సభ్యులు

ఇల్లెందు: ఇల్లెందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఇల్లెందుకు చెందిన కాంపల్లి ఉమామహేశ్వరరావు ఎన్నికయ్యారు. గురువారం జరిగిన బార్ ఎన్నికల్లో త్రిముఖ పోటీ నెలకొంది. అధ్యక్షుడిగా ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా ఎండీ ఖాసీం, ప్రధాన కార్యదర్శిగా కీర్తి కార్తీక్, సంయుక్త కార్యదర్శిగా సీహెచ్ నవీన్, కోశాధికారిగా మూడు వినోద్‌లను ఎన్నుకున్నారు. సీనియర్ న్యాయవాదులు ఎస్.మల్లికార్జున్‌రావు, చెన్నకేశవరావు, దంతాల ఆనంద్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

లక్ష్యం సాధించిన జేవీఆర్ ఓసీ - 2



సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలోని జేవీఆర్ ఓసీ–2 సంస్థ నిర్దేశించిన వార్షిక లక్ష్యం 112 లక్షల టన్నుల లక్ష్యాన్ని 5 రోజుల ముందుగానే ఈనెల 26న నైట్ షిఫ్ట్‌తో సాధించిందని ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది సింగరేణిలో ఏ ఉపరితల గని సాధించని విధంగా కొత్తగూడెం ఏరియాలోని గని సాధించిందన్నారు. మూడేళ్లుగా ప్రాజెక్ట్‌కు నిర్దేశిస్తున్న లక్ష్యాలను 2022- 23లో 100 లక్షల టన్నులు, 2023-24లో 110.68 లక్షల టన్నులు, 2024-25లో 112 లక్షల టన్నులు సాధించినట్లు పేర్కొన్నారు.

క్రీడాకారులకు అభినందన

పాల్వంచ: ఇటీవల కేటీపీపీ భూపాలపల్లిలో జరిగిన టీజీ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ క్రీడా పోటీల్లో కేటీపీఎస్ 7వ దశ క్రీడాకారులు సత్తా చాటారు. ఓపెన్ డబుల్స్‌లో భరద్వాజ్, అనిల్ కుమార్ విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా గురువారం సీఈ కార్యాలయంలో సీఈ కె.శ్రీనివాస్‌బాబు, ఎస్ఈ ఎస్.యుగపతి క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ సెక్రటరీ మహేష్, కేవీ.రమణ, నరసింహారావు, రఘువీర్, ఆరీఫ్, వెంకటేశ్వర్లు, సతీష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కమిషనర్ ఆకస్మిక తనిఖీ

ఇల్లెందు: మున్సిపల్ కార్యాలయం పక్కనున్న గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, హాస్టల్‌ను కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశానుసారం గురువారం ఆశ్రమ బాలికల పాఠశాల, హాస్టల్‌లో విద్యార్థుల మెనూ, గదుల్లో ఫ్యాన్లు, తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, వంట గదులను పరిశీలించారు. ప్రతీరోజు అందించే ఆహారం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

క్రీడా ప్రాంగణాలు.. నిరుపయోగం

- అందుబాటులోకి తీసుకరావాలంటున్న క్రీడాకారులు, మార్నింగ్ వాకర్స్
- పట్టించుకోని అధికారులు



జూలూరుపాడులో నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణం

జూలూరుపాడు: క్రీడల అభివృద్ధి, గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందు ప్రతి గ్రామంలో ఒక గ్రామీణ క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు చేయాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్మించింది. మూడేళ్ల క్రితం ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించిన క్రీడా ప్రాంగణాలను వినియోగించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. అవి నిర్మించిన నాటి నుంచి క్రీడాకారులు, యువత, మార్నింగ్ వాకర్స్ అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి ఉంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం నెరవేరకుండా పోయింది. ప్రతి గ్రామంలో ఒక ఎకరం విస్తీర్ణంలో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణం (టీజీకేపీ) ఏర్పాటు చేయాలని నిబంధన ఉన్నప్పటికీ ప్రభుత్వ స్థలాల గుర్తింపు సమస్యను సాకుగా చూపుతూ అధికారులు 10 కుంటల నుంచి ఎకరంలోపు విస్తీర్ణంలో అడ్డగోలుగా క్రీడా ప్రాంగాణాలను నిర్మించి వదిలేశారు. అదేవిధంగా క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు కేటాయించిన స్థలాలు గ్రామానికి దూరంగా గుర్తించడం, ప్రభుత్వ స్థలాలు లేకపోవడం, ఆక్రమణలో ఉన్న స్థలాలను కేటాయించడం, అటవీ భూమి కేటాయించడం, గుట్టలు, రాళ్లు, చెరువులు, ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటు చేశారు. క్రీడా ప్రాంగణాల నిర్మాణానికి కేటాయించే స్థలాల గుర్తింపు విషయంలో రెవెన్యూ అధికారులు ఏ అంశాలను పరిగణలోకి తీసుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. క్రీడా ప్రాంగణాల మొక్కలు పెంచాల్సి ఉన్నా ఎక్కడా మొక్కలు నాటిన ఆనవాళ్లు లేవు. క్రీడా ప్రాంగణాల్లో కనీస సౌకర్యాలు కల్పించకపోవడం, అందుబాటులో లేకపోవడంతో వాటి పరిస్థితి దయనీయంగా మారింది. దీంతో ఆయా ప్రాంగణాల్లో పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు పెరగడంతోపాటు, చెత్తచెదారంతో డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి.

జూలూరుపాడు మండలంలో 24 గ్రామ పంచాయతీల పరిధిలో 64 గ్రామాలు ఉండగా 18 గ్రామాల్లో టీజీకేపీల నిర్మించేందుకు అధికారులు స్థలాలు గుర్తించారు. అయితే 14 గ్రామాల్లో టీజీకేపీలు నిర్మాణాలు పూర్తి కాగా, మరో నాలుగు గ్రామాల్లో పనులు నిలిచిపోయి మూడేళ్లు అయింది. అదేవిధంగా దాతలు కూడా స్థలాలు ఇచ్చేందుకు ముందుకు రాకపోవడంతో క్రీడా ప్రాంగణాల ఏర్పాటు ఆగిపోయింది. సురారం, వినోభానగర్, చింతలతండా గ్రామాల్లో కేటాయించిన భూముల్లో రాళ్లు, రప్పలు అడ్డంకిగా మారడంతో క్రీడా ప్రాంగణాల పనులు చేపట్టకుండా వదిలేశారు. 18 గ్రామ పంచాయతీలకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు గానీ, క్రీడా ప్రాంగణాలు అనువుగా లేకపోవడంతో క్రీడాకారులు వినియోగించుకునే అవకాశం లేకుండా పోయింది. అంతేకాకుండా అవి ఆకతాయిలకు అడ్డాగా మారుతున్నాయి.

ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాలు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలు కల్పించాలని క్రీడాకారులు, యువత, మార్నింగ్ వాకర్స్ విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆటస్థలాలను అభివృద్ధి చేయాలి



జూలూరుపాడు క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేయాలి. క్రీడా ప్రాంగణం సక్రమంగా లేకపోవడంతో ప్రధాన రహదారి, సీతారామ కెనాల్ కట్ట మీద మార్నింగ్ వాకింగ్ చేయాల్సి వస్తోంది. వాహనాల రద్దీ, ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతూ వాకింగ్ చేస్తున్నాం. అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాలను అందుబాటులోకి తేవాలి.

– వేల్పుల బోసు, వెంగన్నపాలెం

పాఠశాలలో క్రీడా ప్రాంగణం..



గుండెపుడి హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది. వద్దని అధికారులకు వినతిపత్రం అందజేసినా పట్టించుకోలేదు. పాఠశాల గేటు వేసి వెళ్తే క్రీడా ప్రాంగణంలోకి వెళ్లే దారి లేక ఎవరూ వినియోగించుకోకపోవడంతో నిరుపయోగంగా ఉంది.

– వల్లమల్ల చందర్‌రావు, గుండెపుడి

అందుబాటులోకి తీసుకొస్తాం..



క్రీడా ప్రాంగణాల గురించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాం. ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం. క్రీడా ప్రాంగణాలను పరిశీలించి, నిర్వహణపై జిల్లా స్పోర్ట్స్ అథారిటీ దృష్టికి కూడా తీసుకెళ్తాం. అదేవిధంగా క్రీడా ప్రాంగణాల్లో మొక్కలు నాటే విధంగా చర్యలు తీసుకుంటాం.

– డి.కరుణాకర్‌రెడ్డి, ఎంపీడీఓ జూలూరుపాడు

పాఠశాల సందర్శన


వంటలను పరిశీలిస్తున్న ఎంఈఓ జుంకీలాల్

జూలూరుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం మండల విద్యాశాఖ అధికారి బానోత్ జుంకీలాల్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పీఎం శ్రీ స్కూల్‌కి అర్హత పొందడానికి అవసరమైన వసతులు పాఠశాలలో ఉన్నాయా? లేవా..?, తరగతి గదులు, పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించి, హెచ్ఎంకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి, మెనూ పాటించాలని మిడ్ డే మీల్స్ వర్కర్స్‌కు సూచించారు. కార్యక్రమంలో జూలూరుపాడు కాంప్లెక్స్ హెఎం తప్పెట లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యాయుడు రామిశెట్టి శ్రీనివాసరావు, సీఆర్పీ పద్మ, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాల బిల్డింగ్ పరిశీలన

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలోని సింగరేణి మెయిన్ ఆస్పత్రిలో నూతనంగా నిర్మించిన నర్సింగ్ కళాశాల బిల్డింగ్‌ను గురువారం డైరెక్టర్(పా) అండ్ పీపీ వెంకటేశ్వర్లు ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సింగ్ కళాశాలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ... నర్సింగ్ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని, వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కళాశాలలో నేర్చుకున్న అంశాలతో సింగరేణి వ్యాపిత ఆస్పత్రులలో రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. సంస్థ పరిధిలోని అన్ని ఆస్పత్రులలో మెరుగైన వైద్యసేవలు అందించాలని సీఎండీ సుముఖంగా ఉండటమే కాకుండా రూ.కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. సీఎంఓ సుజాత, జీఎం పర్సనల్ (ఆర్‌పీఎం) కవితా నాయుడు, ఏసీఎంఓ ఏం ఉష, డీవైసీఎంఓ సునీల, రాజశేఖర్ పాల్గొన్నారు.

గొత్తికోయ గుంపులో వైద్యశిబిరం


వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

టేకులపల్లి: చింతోనిచెలక పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంతంలో నాగారపు జోగు గొత్తికోయ గుంపులో సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి కంచర్ల వెంకటేష్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. రక్త పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి చికిత్స చేసి మందులు అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ... మూఢనమ్మకాల మీద ఆధారపడకుండా ఏమాత్రం అనారోగ్య సమస్యలు వచ్చినా ప్రభుత్వ వైద్య సిబ్బందిని సంప్రదించి చికిత్స తీసుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆరోగ్య విస్తరణ అధికారి దేవా, సూపర్‌వైజర్ పోరండ్ల శ్రీనివాస్, అసిస్టెంట్లు పాల్గొన్నారు.

‘పది’ విద్యార్థులు పాలిసెట్ రాయాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు పాలిసెట్–25 ప్రవేశ పరీక్ష రాయాలని సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ పాలిటెక్నిక్ నోటిఫికేషన్ జారీ చేయటం జరిగిందని, ఇంజనీరింగ్, ఇతర విభాగాల్లో పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులలో విద్యనభ్యసించాలంటే ఎస్ఎస్‌సీ తర్వాత విద్యార్థులు పాలిసెట్–25 రాయాలని సూచించారు. మార్చి 19, 2025 నుంచి ఏప్రిల్ 2025 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మే 13న పరీక్ష ఉంటుందని, ఉత్తీర్ణులు అయిన వారికి మూడేళ్ల డిప్లొమా చదువుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

పాస్టర్ మృతి కారకులను శిక్షించాలి

పాల్వంచ: రాజమండ్రిలో పాస్టర్ పగడాల ప్రవీణ్ కుమార్ మృతిపై అనేక సందేహాలు ఉన్నాయని, వాటిపై పూర్తి విచారణ జరిపించి కారకులకు చట్టపరంగా శిక్షించాలని యునైటెడ్ చర్చ్ ఫెలోషిప్ డైరెక్టర్ ఎం.జాన్ విల్సన్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక వికలాంగుల కాలనీలోని యూసీఎఫ్ హాల్‌లో మండల స్థాయి పాస్టర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పగడాల ప్రవీణ్ కుమార్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసారు. అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో కె.యేసు రత్నం, వై.సాల్మన్ రాజు, బి.యేసేపు, ఎం.యోబు, కె.భాస్కర్ రావు, బి.జాన్సన్, కె.ఇర్మియ, టి.టైటస్, ఎ.పాల్, కె.అనిల్ కుమార్, బి.మోజస్ తదితరులు పాల్గొన్నారు.

డైరెక్టర్(పా)ను కలిసిన బీఎంఎస్ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి డైరెక్టర్(పా) అండ్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ వెంకటేశ్వర్లును అఖిల భారతీయ ఖదాన్ మజ్దూర్ (బీఎంఎస్) జాతీయ కార్యదర్శి పి.మాధవ నాయక్ ఆధ్వర్యంలో డైరెక్టర్ చాంబర్‌లో గురువారం మర్యాద పూర్వకంగా కలిసి, శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బొగ్గు వేలంలో పాల్గొని కొత్తగనుల కేటాయింపులు చేయటం ద్వారా ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచడం తోపాటు, కార్మికుల రక్షణ చర్యలు, సంక్షేమ కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జీవీ కృష్ణారెడ్డి, బి.రాంసింగ్, బాలకృష్ణ, రాజేందర్, రవీందర్, లక్ష్మణ్, ఎం.మోహన్‌రావు, నాగేశ్వరరావు, అల్లి ప్రకాశ్, సత్యనారాయణ, చంద్రశేఖర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు బావిలో ‘హరిహర వీరమల్లు’

ఇల్లెందు: ఇల్లెందు సింగరేణి జేకే ఓసీలో సినిమా షూటింగ్ సాగుతోంది. గురువారం ఉదయం అక్కడి ఓసీలో చిత్ర యూనిట్ ఏర్పాటు చేసుకున్న ప్రదేశంలో షూటింగ్ చేశారు. హీరో పవన్ కళ్యాణ్ నటించిన ‘హరిహర వీరమల్లు’ చిత్ర దర్శకుడు జ్యోతికృష్ణ పలు సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు.

కార్పొరేషన్‌లో కలపొద్దు..

సుజాతనగర్: కొత్తగూడెం కార్పొరేషన్‌లో సుజాతనగర్‌ను కలపొద్దని ఏడు గ్రామ పంచాయతీల కార్పొరేషన్ విలీన వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ కున్సోత్ ధర్మా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సుజాతనగర్‌లోని సీపీఎం ఆఫీస్‌లో మండలంలోని ఏడు గ్రామపంచాయతీల విలీనం కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ధర్మా మాట్లాడుతూ... కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటులో సుజాతనగర్‌లోని ఏడు గ్రామాలను విలీనం చేయడం అన్యాయమని, ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీర్ల రమేష్, కాట్రాల తిరుపతిరావు, గండమాల భాస్కర్, బచ్చల కూర శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, భూక్యా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి రథోత్సవం


రథయాత్రలో పాల్గొన్న భక్తులు

పాల్వంచ: పట్టణంలోని శ్రీనివాసగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణం మహోత్సవం ముగింపు సందర్భంగా గురువారం సాయంత్రం పట్టణ పురవీధుల్లో స్వామి వారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. వందలాది భక్తులు గోవిందా నామస్మరణతో రథం లాగుతూ భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. కార్యక్రమంలో భక్త సమాజ మండలి అధ్యక్షులు ఆరుట్ల లక్ష్మణాచార్యులు, ప్రధాన కార్యదర్శి ధర్మపురి రాము, ఊకె భద్రయ్య, కందుకూరి రామకృష్ణ, తాటికొండ శ్రీలత, పిట్టా లక్ష్మారెడ్డి, బండి నారాయణ, మిట్టపల్లి నరసింహారావు, కంతాల వెంకటేశ్వరరావు, మేదరమెట్ల శ్రీనివాసరావు, రమేష్, వెంకటరెడ్డి, జిన్నె రమేష్, బండి రాంజీ అంబేద్కర్ పాల్గొన్నారు.

ఫిలిం సిటీ యాజమాన్యాన్ని ఉపేక్షించొద్దు



మాట్లాడుతున్న నబీ

ఇల్లెందు: పేదల భూములు కొట్టేసిన రామోజీ ఫిలింసిటీ యాజమాన్యాన్ని ఉపేక్షించరాదని, తక్షణం కేసులు నమోదు చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. గురువారం ఇల్లెందులో సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలో ప్రదర్శన నిర్వహించి గోవింద్ సెంటర్‌లో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు ఎస్ఏ నబీ మాట్లాడుతూ... 350 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. అక్కడి పేదలకు అండగా పోరాటం చేస్తున్న నేతలతో కలిసి ఆందోళనలో పాల్గొనేందుకు వెళ్లిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీని అరెస్టు చేయటం దుర్మార్గమన్నారు. ఈ చర్యను సీపీఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఆలేటి కిరణ్, కృష్ణ, మోహన్‌రావు, వజ్జ సురేష్, రాజమౌళి, వీరభద్రం, సంతోష్, సుజాత, కమల, నీలారాణి, హుస్సేన్, రాజు, భవానీ పాల్గొన్నారు.

ప్రణాళికతో చదువుకోవాలి

పాల్వంచరూరల్: పోటీ పరీక్షలకు విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదువుకుంటే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బోయిన ఝాన్సీ సూచించారు. స్థానిక మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో గురువారం పోటీ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. అనంతరం అంతర్జాతీయ శిక్షకులు సునిత, పి.శాంతకుమారి, బి.అరుణలు పోటీ పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జ్వలిత, అధ్యాపకులు జాల, శ్రీలక్ష్మి, జె.పద్మలత, కె.లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

పోలీసుల ‘కమ్యూనిటీ కాంటాక్ట్’


సోదా చేస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు

పాల్వంచ: పట్టణంలోని ప్రశాంత్ కాలనీలో గురువారం తెల్లవారుజామున 5.30 గంటలకు డీఎస్పీ ఆర్.సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ‘కమ్యూనిటీ కాంటాక్ట్’ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున పోలీసుల బలగాలు ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి, అనుమానిత వ్యక్తులు, వాహనాలను తనిఖీ చేశారు. పత్రాలు లేని 33 బైక్‌లు, 2 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలు నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, గంజాయికి దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఐ కె.సతీష్, పట్టణ ఎస్ఐలు కె.సుమన్, డి.రాఘవయ్య, ఐ.జీవన్ రాజు, కె.కల్యాణి, ములకలపల్లి ఎస్ఐ రాజశేఖర్, డాగ్ స్క్వాడ్ పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించే వరకు ఉద్యమిస్తాం..

ఇల్లెందురూరల్: గుడిసెల్లో నివాసం ఉంటున్న పేదలకు సౌకర్యాలు కల్పించే వరకు ఉద్యమం కొనసాగుతుందని సీపీఎం మండల కార్యదర్శి ఆలేటి కిరణ్, అబ్దుల్ నబీ అన్నారు. మౌలిక వసతుల కల్పన డిమాండ్‌తో మండల పరిషత్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో గుడిసెవాసులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరేళ్ల క్రితం ఖాళీ స్థలంలో నిర్మించుకున్న గుడిసెలకు సౌకర్యాలు కల్పించాలని ఆందోళన చేసినా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడాన్ని నిరసిస్తూ రిలే నిరాహార దీక్షలకు పూనుకున్నామని చెప్పారు. ఇప్పటికైనా స్పందించని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, మన్యం మోహన్‌రావు, వజ్జ సురేష్ పాల్గొన్నారు.

ఇళ్లస్థలాల ప్రాప్తిరస్తు..


మద్దతు తెలుపుతున్న బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఇళ్లస్థలాల సాధన కోసం జర్నలిస్టులు చేపట్టిన దీక్షలు గురువారం నాటికి ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. బ్రాహ్మణ సమాఖ్య సంఘం అర్చకులు శిబిరం వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా ఇళ్ల స్థలాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అదేవిధంగా టీజీటీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి రమేష్ నాయక్, మున్నూరుకాపు సంఘం నాయకులు దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్‌ను నెరవేర్చాలని కోరారు. వల్లాల ప్రసాద్, కాస హనుమంతరావు, లింగాల గోపాలకృష్ణ, బండి విజయభాస్కర్, మహాలక్ష్మి సత్యనారాయణ, కందుకూరి గణేష్, మత్తిని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేయండి..


సంఘీభావం తెలుపుతున్న బీజేపీ నాయకులు

పాల్వంచ: కేటీపీఎస్ 6వ దశ నిర్మాణంలో పనిచేసిన కార్మికులను ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి న్యాయం చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం స్థానిక కేటీపీఎస్ అంబేద్కర్ సెంటర్‌లో నిర్మాణ కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పానిశెట్టి పాల్గొని సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో గంధం ప్రసాద్‌గౌడ్, బత్తుల వెంకటేశ్వర్లు, మాదారపు లక్ష్మణ్, మాలోతు ప్రశాంత్ నాయక్, వాంకుడోతు హతీరామ్, బి.మురళీ, రెహమాన్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావం.. ఆదర్శం


బాలమేళా కార్యక్రమంలో కలెక్టర్ పాటిల్‌తో హెచ్‌ఎం జ్యోతిరాణి, విద్యార్థులు


పీటీఎం మీటింగ్‌లో వివిధ వేషధారణల విద్యార్థులతో హెచ్‌ఎం

టేకులపల్లి: గ్రామీణ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంతోపాటు తల్లిదండ్రులను భాగస్వామ్యం చేసి ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని నిరూపించారు బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మేకల జ్యోతిరాణి. గత ఏడాది జూలైలో పదోన్నతిపై బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పీఎస్ హెచ్‌ఎంగా జ్యోతిరాణి బాధ్యతలు చేపట్టారు. వచ్చీ రాగానే తన సంస్కరణలతో ప్రభుత్వ విద్యపై నమ్మకం కలిగించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పేరెంట్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) సమావేశాలను విజయవంతంగా నిర్వహించడంలో తనకు తానే సాటి అనిపించుకొని రాష్ట్ర, జిల్లాస్థాయి పర్యవేక్షణ బృందం సమక్షంలో పీటీఎం సమావేశాలను నిర్వహించి, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉత్తమ పీటీఎం స్కూల్‌గా ప్రశంసలు అందుకున్నారు. ఫౌండేషన్ లిట్రసీ న్యూమరసీ ప్రోగ్రాం (ఎఫ్ఎల్ఎన్) ద్వారా విద్యార్థులలో అభ్యాసన సామర్థ్యాలను మెరుగుపరచడానికి ఆటపాటల ద్వారా, బోధనోపకరణాల ద్వారా (టీచింగ్ ఎయిడ్స్) విద్యాబోధనలో సరికొత్త మార్పులకు శ్రీకారం చుట్టి విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలను పెంపొందించడానికి కృషి చేశారు. జ్యోతిరాణి చేపట్టిన సంస్కరణలతో చుట్టుపక్కల గ్రామాల పిల్లలు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా ఆటోల ద్వారా బొమ్మనపల్లి పాఠశాలకు వస్తున్నారు. ఉత్తమ పౌరులుగా ఎదగటానికి, సేవాభావానికి దోహదపడే భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోనే ఏ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో లేనివిధంగా ఈ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగం ఏర్పాటయింది. పాఠశాలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను స్వచ్ఛంద సంస్థల ద్వారా ఏర్పాటు చేశారు. తాజాగా బుధవారం కొత్తగూడెం రేడియో స్టేషన్‌కు విద్యార్థులను తీసుకెళ్లి వారి ప్రతిభ ఆధారంగా కథలు, పాటలు, పద్యాలు వినిపించారు.

1989లో టీచర్ ఉద్యోగంలో చేరిన ఆమె ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చంద్రుగొండ, కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో టీచర్‌గా పని చేసి హెచ్‌ఎంగా పదోన్నతిపై టేకులపల్లి బొమ్మనపల్లి స్కూల్‌కి వచ్చిన ఆమె 36 సంవత్సరాల పాటు విద్యాశాఖలో సేవలు అందించి ఈ నెల 31న ఉద్యోగ విరమణ పొందతున్నారు.